

# సమాధానం

ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ

"నాన్నగారొచ్చే వేళఖుంది. కాస్సేపు చదువుకోరా! ఆయనొచ్చేసరికి మీరు చదువుకుంటుంటే ఆయనకు కొంత ఆనందంగా వుంటుంది" అమ్మ వంటింట్లో వంటపనులతో సతమత మవుతూనే అంటోంది

నిజమే నాన్నగారొచ్చే టైముకి పుస్తకం పెట్టుకుని కూర్చోవాలి. కాని బయట గుడి ఆవరణలో సాంబుగాడు, ఆచారిగాడు, శేషగిరి అంతా కోతికొమ్మచ్చి ఆడుకుంటుంటె నా దృష్టి చదువు మీద ఎలా నిలుస్తుందీ!

కిటికీలో కూర్చుని పుస్తకం తెరిచాను. ఎదురుగా చెట్లెక్కి ఆడుతున్న నేస్తగాళ్లు కనపడుతున్నారు. నా మీద నాకే చిరాకుగా ఉంది. సాంబుడు నాన్న రాత్రిళ్ళు క్లబ్ నించి ఆలస్యంగా ఇంటి కొస్తాడు. శేషగిరి నాన్న తాగుతాడట. తూలుతూ ఏ పదిగంటలకో వస్తాడు. వాళ్ళు చక్కగా రాత్రి ఎనిమిది గంటలవరకు ఆడుకోవచ్చు. నాన్నగారిని చూస్తే ఒక్కొక్కప్పుడు భలే చికాకు వచ్చేస్తుంటుంది.

నాన్నగారికి మంచి పేరే వుంది. పోస్టుమాష్టర్ రామయ్యగారంటే అంతా చేతులెత్తి దండం పెడతారు. ఆరువందల జీతం, ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు, ఇహ లక్ష్మీదేవిగారా! ఆవిడ సాక్షాత్తూ లక్ష్మీదేవే అంటూ పొగుడుతూ ఉంటారు.

అంత మంచి నాన్నగారవటమే — నా చికాకుకు కారణం. పోష్టాఫీసు ఆరుగంటలకు కట్టేస్తే ఆరుగంటల పదినిమిషాలకు నాన్నగారింట్లో ఉంటారు. అక్కడ సైకిలెక్కడం ఇక్కడ దిగటం... సైకిలు దిగగానే అమ్మ ఎదురుగా వెళ్లి ఫ్లాస్కు అందుకుంటుంది.

కాళ్లు చేతులు కడుక్కుంటూ ఇహ ఆఫీసు విషయాలన్నీ అమ్మతో చెప్పటం, అమ్మ కాఫీ చేసి ఇస్తే పడక కుర్చీలో కూర్చుని ముందు స్టూలు వేసుకొని కాళ్ళు బారజాపుకుని కబుర్లు ఆడటం...ఇలా పావుగంటో అరగంటో గడచిన తర్వాత అమ్మ వచ్చి స్విచ్ వేస్తుంది. దీపం వెలుగుతుంది. అమ్మ మంగళసూత్రాలు కళ్ల కద్దుకుని నాన్నగారి చేతికి పేపరిచ్చి వంటింట్లోకెళ్లిపోతుంది.

ఇహ ఆ పేపర్ వళ్లో వేసుకుని చదువుకోచ్చే! ఉహు, అలా చేస్తే నాకేం బాధ, అలా చేయరే!

"ఒరే కృష్ణా! లెక్కలెంతవరకు చేశావు?" ముందు అన్నయ్యతో మొదలెడతారు ఆ తర్వాత "ఏం చిన్న దొరగారు ఇంగ్లీషు పాఠం చదివేరా?" నన్నందుకుంటారు.

మహా ఓపిగ్గా చెబుతారు అర్థం కాని విషయాలు. అయితేనేం ... తలెత్తి చూస్తే గుళ్లో కేరింతలు, ఆటలు... ఇహ చదువు మీదకు దృష్టి ఎలా పోతుంది?

ఆయనేదో అడుగుతారు, నేను తడబడతాను. అంతే! పుస్తకంలో వేలుంచి, కుర్చీలో వెనక్కి వాలి మొదలెడతారు పాఠాలు. పుస్తకంలో పాఠాలు కాదు, జీవిత పాఠాలు!

"చిన్నా! ఈ నీ వయస్సు కష్టపడి చదువుకోవల్సిన వయసు. ఇప్పుడు చదువుకోకుండా కాలక్షేపం చేస్తే జీవితాంతం ఇబ్బంది పడ్డాలా! రాను రాను రోజులు మారిపోతున్నాయి వచ్చేవి గడ్డురోజులు ఈ రిజర్వేషన్లు, రికమెండేషన్లు, మనబోటి వాళ్ళకి ఉద్యోగం దొరకనివ్వవు. మనం మెరిట్‌లో ఉండాలి. మా ఆఫీసులో గుమాస్తా కొడుక్కి మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చింది. నువ్వూ అలా సంపాదించాలి. అంటే కష్టపడి చదవాలి. నువ్వు గొప్పవాడివయితే నాకానందం కాదూ" ఇలా సాగిపోతుందా పాఠం.

ఆయన చెప్పేది కొంత బావున్నట్టే ఉంటుంది. ఏవేవో నిశ్చయాలు మనసులో చేసేసుకుంటాను. ఇంతలో అమ్మ భోజనానికి పిలుస్తుంది. వేడి వేడి అన్నం తిని పుస్తకం ముందేసుకుని కూర్చునేసరికి కునికిపాట్లు. నాన్నగారు బాలక్కకు లెక్కలు చెబుతుంటే, అక్క తిట్లు తింటుంటే కునికిపాట్లలోంచి నిద్రలోకి జారిపోతాను. ఆ తర్వాత అమ్మ నన్ను పక్కమీదకు ఈడుస్తుంది కాబోలు.

రోజూ ఇదేతంతు. నాకు గొప్ప చిరాకు. సాయంత్రం ఆరింటికే నాన్నగారెందుకు ఇంటికి రావాలి! కొంచెం ఆలస్యంగా ఇంటి కొస్తే ఆయన సొమ్మేం పోయింది. ఈవాళ అర్జంటుగా నాన్నగారింటికి రావాల్సిన అవసరం నాకు గుర్తొచ్చింది.

"అమ్మా! ఈవాళ నాన్నగారు కేన్వాస్ షూస్ కొంటావన్నారూ?" గట్టిగా వంటింట్లోకి అరిచాను.

అమ్మ వంటింట్లోంచి ముఖం తుడుచుకుంటూ బయట కొచ్చింది.

"ఇప్పుడొచ్చి నిన్ను తీసికెళ్తానన్నారు! వచ్చే టైమయింది. రెడీగా ఉండు" అంది అమ్మ బొట్టు పెట్టుకుని.

**"గాప్"**

ఒకప్పుడు
నాన్నకూ నాకూ
జనరేషన్ గాప్!
ఇప్పుడు
మా పెద్దాడికీ
చిన్నాడికీ
జనరేషన్ గాప్!

— కవిత

"నే నెప్పుడో రెడీ! నేను నాన్నగారు వెళ్ళి బూట్లు కొనుక్కుంటాం!" అని అన్నయ్యను ఊరించి, అమ్మ కేసి తిరిగి "అమ్మా! నాన్నగారు కూడా హాఫ్ బూట్ కొనుక్కుంటారు కదమ్మా!" అడిగేను.

"ఏమో! ఆయనిష్టం" అంది అమ్మ.

నాన్నగారిలో ఇంకో నచ్చని విషయం ఉంది నాకు. నాన్నగారికి ఆరువందల జీతం. ఎప్పుడు ఇంట్లో డబ్బు ఉంటుంది. అయినా సరే ఆయనకోసం ఆయనేం ఖర్చుపెట్టుకోరు. ఆఫీసు స్టాఫ్ అంతా గణేష్ భవన్‌లో పొట్ట పగిలేటట్టు తింటారు నాన్నగారు తప్ప. అమ్మ చేసిచ్చిన డబ్బాలో టిఫిన్ తిని, ఫ్లాస్కు కాఫీ తాగుతారు. తాగేసీళ్ళు ఇంటినించే పట్టుకెళతారు. ఆఫీసులో నీళ్లు శుభ్రంగా ఉండవంటారు. మహా చాదస్తం అనిపిస్తుంది నాకు.

నాన్నగారి జేబుఖర్చు నెలకు యాభై పైసలు! అదీ ఫస్టుతారీకు జీతం తీసుకునే టప్పుడు అంటించే స్టాంపుకి పదిపైసలు, మిగిలిన నలభైపైసలు నెలమొత్తానికి సైకిలుగాలికి మాత్రమే. ఆయన ఖర్చు అంత తక్కువ. అలా అని మళ్ళీ మాకేం లోటు చేయరు.

మూడేళ్ళుగా దాదాపు నేను వింటున్నాను. "హాఫ్‌బూటు ఒకటి కొనుక్కోవాలి లక్ష్మీ" అమ్మతో అంటుంటారు.

"కొనుక్కోండి ఖర్చులు ఉంటునే ఉంటాయి" అంటుంది అమ్మ.

వారాలు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయి. ఆయన దగ్గర డబ్బు ఉండదా అంటె ఉంటుంది అదేంటో కొనుక్కోరు.

నిన్న అమ్మ గట్టిగా చెప్పింది—

"వందరూపాయలున్నాయి ... బిలుండే ఫస్టుగా. రేపు మూర్తిగాడితోపాటు మీరు హాఫ్‌బూటు కొనేసుకోండి" అమ్మ నొక్కి చెప్పింది. ఏంచేస్తారో మరి?

నా చూపులన్నీ గడియారం మీదనే ఉన్నాయి. ఆరుగంటల ఏడునిమిషాలయింది. మరో మూడు నిమిషాలలో నాన్నగారు వచ్చేస్తారు. కేన్వాస్‌షూస్‌తో తను రేపట్నుంచి డ్రిల్లుకెళ్ళనున్ను తెల్లటి మేజోళ్ళు మల్లెపువ్వుల్లా ఉంటాయి.

అసలు నాన్నగారితో సైకిలుమీద బజారు కెళ్ళటమే గొప్పహాయి ముందు చిన్నసీటు మీద కూర్చుని తను, వెనక నాన్నగారు సైకిలు తొక్కుతూ ఉంటారు తెలుసున్నవాళ్ళు నాన్నగారికి నమస్కరిస్తారు. అప్పుడు తనకెంత గర్వమో!

గుమ్మంలో బెల్ చప్పుడయింది. నాన్నగారొచ్చేసారు. అమ్మ ఎదురెళ్ళి చేతిలో సంచీ అందుకుంది. నన్నుచూసి—


"మీ కోసమే ఎదురుచూస్తున్నాడు" అంది. నాన్నగారు నవ్వేరు.

మరో పదినిమిషాల తర్వాత నాన్నగారు ముఖం కడుక్కుని, కాఫీతాగి, బజారుకి బయల్దేరారు. నాకెంతో ఉల్లాసంగా ఉంది.

అమ్మ పెట్టెలోంచి డబ్బుతెచ్చి ఇచ్చి "వెళ్ళిరండి" అంది.

"ఇంత డబ్బెందుకూ! ఇరవైచాలు" అన్నారు నాన్నగారు.

"మీరూ హాఫ్ షూ కొనుక్కోండి" అంది అమ్మ.



# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

## ఉత్సవాల ప్రయోజనం

మనకు ప్రతిసంవత్సరమూ కొన్ని పర్వాలూ పండుగలు వస్తూ ఉంటాయి. ఇవి సామాన్యంగా మతాలకు సంబంధించినవి. కొన్నిటిని సామాన్యంగా జరుపుకున్నా కొన్నిటిని ఆర్భాటంగా జరుపుకుంటారు. విశిష్టమయిన ఉత్సవాలలో వేడుకలు జరుపుకుని, ఆనందంగా కాలం గడుపుతారు. ఆ ఉత్సవాలకు బంధుమిత్రులను ఆహ్వానించి గౌరవిస్తారు. బంధువులనూ, మిత్రులనూ కలుసుకొనుటకు ఈ పండుగలు మంచి అవకాశం ఇస్తాయి. పవిత్రక్షేత్రాలలో జరిగే తిరునాళ్ళు ఇలాటివే! ఈ ఉత్సవాలలో బంధుమిత్రులను కలుసుకోవడమే కాక పవిత్ర క్షేత్రతీర్థాలలో స్నానం చేసిన ఆత్మసంతృప్తి, భక్తిభావంలో స్థిరతా ఏర్పడగలవు.

పెద్ద ఉత్సవాలు జరిగినప్పుడు విజ్ఞానదాయకములైన ప్రదర్శనాలు జరుపబడుతాయి. అవి మనసునకు వింతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఆ సమయాలలో విక్రయానికి వివిధ వస్తువులతో అంగళ్లు తాత్కాలికంగా ఏర్పడతాయి. అందువల్ల వివిధములైన విచిత్రవస్తువులను సంపాదించడానికి కూడా వీలు ఉంటుంది. మతాలతో సంబంధంలేని ఉత్సవాలలో అన్ని మతాలవారూ పాల్గొంటారు. మత సంబంధమైన ఉత్సవాలలో మిత్రుల ఆహ్వానాన్ని పురస్కరించుకొని ఇతర మతాలవారు సంతోషంగావచ్చి వారిని అభినందిస్తూ గౌరవిస్తారు. ఇట్లు హిందువుల ఉత్సవాలలో ముస్లిములు, వారి మతోత్సవాల్లో హిందువులూ పాల్గొంటారు. ఇలాగే క్రైస్తవులు మున్నగువారున్నూ. క్రైస్తవుల పండుగరోజుల్లో ఇతర మతస్థులు వారి యిండ్లకుపోయి, వారిని కలిసికొని వారికి శుభాకాంక్షలు అందజేస్తారు. ఇది పరస్పర మైత్రికి సూచకం: మైత్రిని వృద్ధిపొందించేది కూడా. కాని కొన్నిచోట్ల మూర్ఖపు పట్టుదలలవల్ల అవాంఛనీయ సంఘటనలు జరగడంకూడా ఉన్నది. ఒక మతానికి చెందిన ఉత్సవాల్లోనే ఊరేగింపులు జరపడంలో వేర్వేరు పార్టీలవారు కలహించి కొట్టుకోవడం జరుగుతున్నట్లు మనం పత్రికల వల్ల తెలుసుకుంటున్నాం. ఇట్టి స్థితిలో ఒకమతం వారు వేరొకమతం వారితో తగవులాడడంలో ఆశ్చర్యంలేదు. అలా కలహించడం అవివేకుల లక్షణం. పరస్పరమైత్రికి ప్రతీకలైన ఉత్సవాల పరమాశయమే దీనివల్ల దెబ్బ తింటున్నది. దీనిని గమనించి, ఉత్సవాల ముఖ్యప్రయోజనం గుర్తించి పరస్పరమైత్రికి అన్ని మతాల వారూ దోహదం చెయ్యడం మిక్కిలి అవసరం.

---

"ఇప్పుడుకాదు. తర్వాత చూద్దాం. ఇరవై వాలులే" అన్నారు నాన్నగారు.

చెప్పేనుకదా ... నాన్నగారంటే ఇందుకే నాకు చిరాకు.

* * *

సైకిలు చక్రం గిర్రున తిరుగుతోంది.

"ఒరే నాన్నా! జానకీ! కాలు లోపలకి పెట్టుకో చక్రంలో పడగలదు" హెచ్చరించేను జానకిని.

"ఏం ఫరవాలేదు డాడీ!" తేల్చేసింది జానకి కాన్వెంటు పిల్లకదా ధైర్యం జాస్తి.

జానకి అంటే నాకు వల్లమాలిన అభిమానం. కారణం మా నాన్నగారి పేరు కావడమే.

తొలిచూలు నా భార్య ఏ బిడ్డను ప్రసవించినా మా నాన్నగారి పేరు పెట్టాలనుకున్నాను. పెట్టాను. నాన్నగారిపేరు జానకి రామయ్యగారు. నా పిల్ల పేరు జానకి.

"డాడీ! సత్యగారిలో 'ఎలిఫెంట్' పిక్చర్ ఆడుతోంది"

"ఆడుతోంది, అయితే ఏంచేద్దాం."

## సమాధానం

"చూద్దాం డాడీ! బావుందిట!"

"ఎల్లుండి నించి ఎక్జామ్స్ కదరా! బాగా చదవాలి. క్లాసులో ఫస్టు రేంకు రావాలి. అసలే రోజులు బాగోలేవు. ఆడాళ్ళయినా... మగాళ్ళాయినా... చదువుకుని ఉద్యోగాలు చేస్తేకాని గడవని రోజులొచ్చాయి."

"ఫో డాడీ! రోజూ అదే లెసన్" నవ్వింది జానకి. నాకు నవ్వొచ్చేసింది. పసిపాపలా నవ్వేసాను.

ఇద్దరం బాటా కంపెనీ ముందు సైకిలు దిగి లోపలకు నడిచేం.

అరగంట తర్వాత తనకు వచ్చిన షూ ఏదో చెప్పింది జానకి. నలభై అయిదు రూపాయలకు బిల్లురాసి అందించేడు షాపువాడు. పర్సు తెరిచేను రెండువంద నోట్లున్నాయి. అందులో ఒకనోటు తీసి షాపువాడికిచ్చేను.

"డాడీ! డాడీ! మర్చిపోయారు" కంగారుగా అరిచింది జానకి.

"ఏంటా!"

"మీరన్నీ మర్చిపోతారు. మమ్మీ మిమ్మల్ని 'షూ' కొనుక్కోమంది." నవ్వింది వెక్కిరిస్తూ.

"తర్వాత కొనవచ్చులెమ్మా!"

"అలా రెండేళ్ళనుంచి చెబుతున్నారు. మీచేత పట్టుపట్టి కొనిపించమంది మమ్మీ. కొనుక్కోండి డాడీ!" చేయిపట్టుకుని మారాం చేస్తోంది జానకి.

ఏం చెప్పాలో తెలియక నేను మాట్లాడలేదు. "అన్నిటికీ తర్వాత ... తర్వాత... అంటారు పెద్ద..." అంటోంది జానకి.

సమాధానం ఏం చెప్పాలి! నా ప్రశ్నలకు, చికాకులకు సమాధానం పాతికేళ్ళతర్వాత అర్థమైంది. చెప్పినా... ఇప్పుడు నా సమాధానం జానకికి అర్థంకాదు... ఆమె కర్థం కావాలంటే మరో పాతికేళ్ళుపోవాల్సిందే... అప్పటికి కాని ఆమెకు సమాధానం దొరకదు.